సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం ׀ 1 ׀ జూలై ׀ 2025



పోరు ఉద్ధృతం

ఉద్యోగ భద్రత కోసం మునిసిపల్ ఇంజనీరింగ్, అవుట్ సోర్సింగ్ కార్మికుల పోరు ఉద్ధృతంగా సాగుతోంది. తమను పర్మినెంట్ చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. 8లో ▸



నమో.. నారసింహ

ద్వారకాతిరుమల: లక్ష్మీపురం శ్రీసంతాన వేణుగోపాల జగన్నాథ, వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం జగన్నాథుడు నారసింహుని అవతారంలో దర్శనమిచ్చారు.



రేపు ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం అయ్యప్ప స్వామికి ఈ నెల 2న స్వామి వారి జన్మ నక్షత్రం ఉత్తరా నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

న్యూస్‌రీల్

ఫిర్యాదులకు శాశ్వత పరిష్కారం చూపాలి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న అడిషినల్ ఎస్పీ భీమారావు

భీమవరం: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అందే ఫిర్యాదులకు చట్టపరిధిలో శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా అడిషినల్ ఎస్పీ వి.భీమారావు అన్నారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదులను స్వీకరించిన అనంతరం సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా 11 అర్జీలు స్వీకరించారు. వీటిలో వేధింపులు, భూ–ఆస్తి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు వంటివి ఉన్నాయి.

డీఎస్సీ పరీక్షకు 96 శాతం హాజరు

భీమవరం: జిల్లాలో సోమవారం నిర్వహించిన మెగా డీఎస్సీ పరీక్షకు 96 శాతం అభ్యర్థులు హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఇ.నారాయణ చెప్పారు. మూడు పరీక్షా కేంద్రాల్లో మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 360 మందికి 347 మంది హాజరయ్యారన్నారు. ఎక్కడా మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదుకాలేదని తెలిపారు.

పీజీ సెట్‌లో 3వ ర్యాంకు



పీజీ సెట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపల్, అధ్యాపకులు

గణపవరం: రాష్ట్ర ఉన్నత విద్యామండలి నిర్వహించిన పీజీ సెట్ ఫలితాలలో గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజి విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపల్ నిర్మలకుమారి తెలిపారు. జువాలజీలో కె.కృష్ణప్రియ రాష్ట్ర స్థాయిలో 3వర్యాంకు సాధించినట్లు తెలిపారు. ఆమెతో పాటు మరో 8 మంది వెయ్యిలోపు ర్యాంకులు సాధించారన్నారు. రూపశ్రీ బోటనీలో 22వ ర్యాంకు, ఎస్.సంధ్యారాణి 70వ ర్యాంకు, కె.బాహ్యలహరి 74వ ర్యాంకు సాధించారని, కెమిస్ట్రీలో బేబీ శిరీష 96వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వెయ్యిలోపు ర్యాంకులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్, అధ్యాపకులు సోమవారం అభినందించారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో నియామకాలు

పెదవేగి: వైఎస్సార్‌సీపీ నేతలకు కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉండి ఆదుకుంటామని సీనియర్ న్యాయవాదులు అల్తి శ్రీనివాస్, బైగాని రంగరావులు అన్నారు. వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడిగా భీమడోలుకు చెందిన అల్తి శ్రీనివాస్, జనరల్ సెక్రటరీగా పెదవేగి మండలం విజయరాయికి గ్రామానికి చెందిన బైగాని రంగారావు నియమితులయ్యారు. రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షుడు ఎం.మనోహర్‌రెడ్డి వీరిని నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని ఖండించారు. రానున్న రోజుల్లో ఎలాంటి సమస్య వచ్చినా సమాచారం అందిస్తే అండగా నిలుస్తామని భరోసా కల్పించారు.

గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): గురు పౌర్ణమి పర్వదినం సందర్భంగా ఏలూరు జిల్లాలోని అన్ని డిపోల నుంచి అరుణాచలం గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి షేక్ షబ్నం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు డిపోల నుంచి బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. జూలై 8న సాయంత్రం 6 గంటలకు బస్సులు బయలుదేరి 9న శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం దర్శనం అనంతరం ఆ రోజు రాత్రికి అరుణాచలం చేరుకుంటాయన్నారు. 10వ తేదీ ఉదయం గిరి ప్రదక్షిణ అనంతరం కంచిలోని కామాక్షి అమ్మవారి దర్శనం చేసుకుని తిరిగి గమ్యస్థానాలకు సర్వీసులు బయలుదేరుతాయన్నారు. టిక్కెట్ రూ.3 వేలుగా నిర్ణయించామని తెలిపారు. మిగిలిన ఖర్చులు ప్రయాణికులు భరించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఆషాడ, శ్రావణ మాసాల్లో ప్రతి ఆదివారం అమ్మవార్ల దర్శనానికి ప్రత్యేక టూర్ ప్యాకేజీ ఏర్పాటు చేశామని, ఈ బస్సులు మూడు డిపోల నుంచి తెల్లవారు జామున 4 గంటలకు బయలుదేరి దర్శనానంతరం గమ్యస్థానానికి చేరుకోవచ్చునన్నారు. టిక్కెట్లు కావాల్సినవారు ఏలూరు 93467 67670, రిజర్వేషన్ కౌంటర్ 63038 59484, జంగారెడ్డిగూడెం 9194929 49350, నూజివీడు 73829 01757 నెంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

ప్రజలకు ఏం చెప్పాలి?

- జిల్లాలో ఏడాదిగా ముందుకు పడని ప్రగతి
- గిట్టుబాటు ధర లేక అన్నదాతల ఆక్రందన
- ప్రతి నియోజకవర్గంలోనూ అధ్వాన్నంగా రహదారులు
- సుపరిపాలన అంటూ ప్రజల వద్దకు ఎలా వెళ్లాలి?
- టీడీపీ ఎమ్మెల్యేల్లో తీవ్ర అంతర్మథనం



తమ్మిలేరు వరద ఉధృతిని పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు



మద్దతు ధర కోసం ధర్నా చేస్తున్న కోకో రైతులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఎన్నికల్లో లెక్కకు మించి హామీలిచ్చాం.. ఏడాది కాలంలో చేసిందేమీ లేదు.. సుపరిపాలన అంటూ ఇప్పుడు ప్రజల వద్దకు వెళ్లి ఏం చెప్పాలి? ప్రజలు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పగలమా? ఇలాంటి పరిస్థితుల్లో సుపరిపాలన పేరుతో ఇంటింటికి వెళితే అభాసుపాలవుతామని కూటమి ప్రజాప్రతినిధుల్లో అంతర్మథనం మొదలైంది. పొగాకు రైతులు మొదలుకొని మామిడి రైతుల వరకు, ఆక్వా ఇలా అన్ని రంగాలు పూర్తి నష్టాల బాటలో ఉంటే ప్రభుత్వం ఏం చేయలేకపోయిందనే భావన ప్రజల్లో ఉందని, ప్రతి నియోజకవర్గంలో రూ.10 కోట్లతో చేసిన అభివృద్ధి ఇది అని చెప్పుకోవడానికి ఏం లేదంటూ అధికార పార్టీల నేతల్లో తీవ్ర చర్చ సాగుతోంది. ఈ తరుణంలో బుధవారం నుంచి సుపరిపాలన పేరుతో ఇంటింటికి వెళ్లేలా షెడ్యూల్ ఖరారైంది.

ఎన్నికల సమయంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఆయన తనయుడు లోకేష్ లెక్కకు మించి హామీలిచ్చినా ఒక్కదానిపైన కూడా దృష్టి సారించకపోవడంతో సర్వత్రా విమర్శలతో పాటు ప్రజల్లో అసంతృప్తి పెరిగిపోతుంది. ఈ తరుణంలో ఇంటింటికి టీడీపీ అనే కార్యక్రమం ఇబ్బందికరమనే వాదన టీడీపీ నేతల్లో వ్యక్తమవుతోంది.

ఊసేలేని కీలక హామీలు

ఎన్నికల సమయంలో అధికారంలోకి రాగానే చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభిస్తామని ప్రకటించారు. ఏడాది దాటినా తొలి అడుగు పడలేదు. మళ్లీ దాన్ని రూ.3700 కోట్లకు ప్రాజెక్టును ఖరారు చేస్తున్నట్లు రూ.1780 కోట్లు బడ్జెట్‌లో కేటాయిస్తామని 2026 మార్చికల్లా పూర్తి చేస్తామని ప్రకటించారు. మరో 8 నెలల సమయం ఉన్నప్పటికీ కనీసం ప్రాజెక్టు పనులపై క్షేత్రస్థాయిలో సమావేశం కూడా జరగలేదు. గతేడాది వరదల సమయంలో ముఖ్యమంత్రి ఏలూరులో పర్యటించి శనివారపుపేట కాజ్‌వేను రూ.15 కోట్లతో నిర్మిస్తామని ప్రకటించారు. ఇంతవరకూ దాని ఊసే లేకపోవడం గమనార్హం.

క్రాప్ హాలిడేపై రాజకీయ ఒత్తిడి

ఉమ్మడి జిల్లాలో 2.52 లక్షల ఎకరాల్లో ఆక్వా చెరువులు ఉన్నాయి. రొయ్య ధర పతనం కావడం, ఇతర సమస్యలతో నర్సాపురం, ఆచంట, పాలకొల్లు మూడు నియోజకవర్గాల పరిధిలో 55 వేల ఎకరాల్లో క్రాప్ హాలిడే ప్రకటించారు. రాష్ట్ర స్థాయిలో చర్చనీయాంశంగా మారడంతో రాజకీయ ఒత్తిడితో క్రాప్ హాలిడేను తెరమరుగు చేస్తున్నారు. నర్సాపురంలో ప్రతిష్టాత్మకమైన ఫిషరీస్ యూనివర్శిటీకి కూటమి పాలనలో గ్రహణం పట్టించారు. గత ప్రభుత్వం 40 ఎకరాల స్థలాన్ని కేటాయించి రూ.100 కోట్ల నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించింది. కొంతమేరకు పూర్తి చేసి తరగతులు కూడా ప్రారంభించింది. కూటమి ప్రభుత్వం పూర్తిగా విస్మరించడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో రైతుభరోసా కేంద్రాల్లో ఫిషరీస్ యూనివర్శిటీ విద్యార్థులు తరగతులకు హాజరవుతున్నారు.

అన్నదాత గోడు పట్టదా?

వ్యవసాయ ఆధారిత జిల్లాలో గత ఏడాది కాలంలో రైతులు పూర్తిగా నష్టపోయారు. 52 వేల ఎకరాల్లో విస్తరించి ఉన్న మామిడికి టన్ను రూ.80 వేల నుంచి రూ.లక్ష పలకాలి. అయితే రూ.8 వేల నుంచి రూ.10 వేలకు పతనమైంది. ప్రభుత్వ సబ్సిడీ లేకపోవడం, అనుబంధ పరిశ్రమలు లేక వేలాది మంది మామిడి రైతులు రోడ్డునపడే పరిస్థితి. గతంలో రూ.1140 పలికిన కిలో కోకో ఇప్పుడు రూ.400కు చేరింది. రాష్ట్రంలోనే ఏ జిల్లాలోని లేని విధంగా కోకో అత్యధిక సాగు ఏలూరు జిల్లాలో ఉంది. 36,150 ఎకరాల్లో కోకో సాగు చేసి ఏటా 12 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి సాగిస్తున్నారు. ధరలు పతనం కావడంతో నెలలు తరబడి ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం లేదు. ఆయిల్‌పామ్ రైతులదీ ఇదే పరిస్థితి. టన్నుకు రూ.2 వేల వరకూ ధర పతనమైనా ప్రభుత్వం స్పందించని పరిస్థితి. పొగాకు రైతులు కూడా గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోయారు.

సంక్రాంతి నాటికి రోడ్లు ఎక్కడ?

జిల్లాలో రోడ్లను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తాం. చిన్నపాటి గుంతలు, మరమ్మతులకు ఆస్కారమే లేకుండా అన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతామని హడావుడి చేసి నవంబరులో టెండర్లు పిలుస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది సంక్రాంతి కల్లా చిన్న సమస్య కూడా ఉండదని ప్రకటించారు. దాదాపు రూ.100 కోట్లకుపైగా పనులు గుర్తించినట్లు ప్రకటించారు. ఏ ఒక్కటీ పూర్తి కాకపోగా రోడ్లు మరింత అధ్వానంగా మారాయి. ప్రధానంగా ఏజెన్సీ ఏరియా రహదారులైతే అత్యంత దారుణంగా ఉన్నాయి. ఏజెన్సీలోని రేగులపాడు నుంచి రేపల్లి వరకు, పులిరామన్నగూడెం నుంచి గోగుమిల్లి వరకు, అలివేలు డ్యాం నుంచి అలివేలు వరకు ఇలా ప్రధాన రహదారులు అత్యంత దారుణంగా ఉన్నాయి. తడికలపూడి– జంగారెడ్డిగూడెం, శ్రీనివాసపురం– ములకలంపాడు, వీరవాసరం నుంచి బ్రాహ్మణచెరువు, పాలకోడేరు నుంచి అత్తిలి, భీమవరం– వెంప రహదారులది ఇదే పరిస్థితి. ఏజెన్సీలో ఉన్న జాతీయ రహదారి, భీమడోలు నుంచి తణుకు జాతీయ రహదారిపై అనేక ప్రాంతాల్లో మరమ్మత్తులు చేయాల్సి ఉంది. ఈ నెల 15న నారాయణపురం వంతెనకు భారీ రంధ్రం పడి రాకపోకలు నిలిచిపోయాయి.

ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు అర్హులైన ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకట లక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలోని అన్ని యాజమాన్యాల ప్రభుత్వ, స్థానిక సంస్థల, మున్సిపల్, ఏపీ మోడల్, గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు అర్హులన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించడానికి ఈ నెల 15 వరకూ గడువు ఉందని, జిల్లా సెలెక్షన్ కమిటీ ఎంపికలు రాష్ట్ర కమిటీకి ఈ నెల 16 నుంచి 25 లోపు పంపడానికి సమయం ఉంటుందన్నారు. దరఖాస్తుల సమర్పణకు పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులు అర్హులు కారని, సంబంధిత సంవత్సరంలో కనీసం నాలుగు నెలలు విధులు నిర్వహించిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

అలసత్వాన్ని సహించేది లేదు



పీజీఆర్ఎస్‌లో అర్జీలు స్వీకరించి మాట్లాడుతున్న కలెక్టర్ సి.నాగరాణి

భీమవరం(ప్రకాశం చౌక్): పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో అలసత్వం సహించేది లేదని కలెక్టర్ సి.నాగరాణి అధికారులను హెచ్చరించారు. సోమవారరం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి పీజీఆర్ఎస్‌లో ఆమె పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరవల్లి ఘటనపై వినతులు

అత్తిలి మండలం ఆరవల్లి గ్రామంలో ఇటీవల మాలలు, మాదిగల మధ్య జరిగిన గొడవలపై సోమవారం మాలలు, మాదిగలు వారి సంఘాల నాయకులతో వచ్చి కలెక్టర్‌కు వినతి పత్రాలు అందజేశారు.

ధాన్యం డబ్బులు చెల్లించాలి : మూడు నెలలు దాటినా రైతులకు కూటమి ప్రభుత్వం ధాన్యం డబ్బులు చెల్లించకపోవడంపై సోమవారం కలెక్టరేట్ వద్ద ఆంధ్రప్రదేశ్ రైతు, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో రైతులు ధర్నా నిర్వహించారు. నెలలు గడుస్తున్నా డబ్బులు చెల్లించకపోవడం సిగ్గు చేటన్నారు. ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. తమ బడి తమకు కావాలంటూ పెనుమంట్ర మండలం బ్రాహ్మణచెర్వు వెలమపేట విద్యార్థులు తల్లిదండ్రులతో కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. పాఠశాలను గ్రామంలో మరో పాఠశాలలో విలీనం చేశారని, దాంతో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు అక్కడి వరకూ వెళ్లి చదువుకోడానికి ఇబ్బంది పడుతున్నారన్నారు.

పంచాయతీరాజ్ సమస్యలపై వినతిపత్రం

పంచాయతీరాజ్‌లోని సమస్యలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీల సమస్యలపై వైఎస్సార్‌సీపీ పంచాయతీ రాజ్ విభాగం నాయకులు, పార్టీ నాయకులు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి వినతి పత్రం అందజేశారు. వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తన్నేడి గిరి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో పంచాయతీల్లో అనేక సమస్యలు ఉన్నాయన్నారు. 15 ఆర్థిక సంఘం నిధులు మళ్లించి పంచాయతీల అభివృద్ధి కుంటిపడేలా చేశారన్నారు. అఖరికి సర్పంచ్‌లు, ఎంపీటీలకు వేతనాలు కూడా చెల్లిచడం లేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పంచాయతీ అభివృద్ధి కోసం సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. ఆయన పాలనలో పంచాయతీల అభివృద్ధి కోసం ప్రవేశపెట్టి కార్యక్రమాలను పక్కన పెట్టారన్నారు.

కలెక్టర్‌గా ఏడాది పూర్తి

పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్‌గా చదలవాడ నాగరాణి ఏడాది పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. జాయింట్ కలెక్టర్, పలువురు జిల్లా అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు పేదలకు అందేలా కలెక్టర్ నిరంతరం కృషి చేస్తున్నారన్నారు.

పల్లెల్లో పడకేసిన పారిశుద్ధ్యం

- అధ్వానంగా డ్రెయినేజీ వ్యవస్థ
- వర్షాలకు రోడ్లపైకి మురుగునీరు



ఇరవగరంలో మెయిన్ రోడ్ వెంట చెత్తాచెదారం



పాలకోడేరు మండలం కొండేపూడిలో నీట మునుగుతున్న రోడ్డు

భీమవరం(ప్రకాశం చౌక్): పల్లెల్లో పారిశుద్ధ్యం పడకేసింది. భారీ వర్షాలకు డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా మారింది. కనీసం కచ్చడ్రైయిన్లు కూడా లేకపోవడంతో మురుగునీరు రోడ్లపై పారుతోంది. కొన్ని గ్రామాలల్లో డ్రెయినేజీల్లో పూడిక తీయక గడ్డి, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. దీంతో మురుగునీరు వెళ్లే దారిలేక రోడ్లపైకి వస్తోంది. దోమల వృద్ధి చెందడంతో ప్రజలు రోగాల పాలువుతున్నారు. మలేరియా, టైఫాయిడ్ వంటి విష జ్వరాలు వ్యాపించే ప్రమాదం పొంచి ఉంది. జిల్లాలో మొత్తం 409 గ్రామ పంచాయతీలు ఉండగా.. ఎక్కువ శాతం పంచాయతీల్లో ఇదే పరిస్థితి.

పట్టించుకోని పంచాయతీ సెక్రటరీలు

పంచాయతీ సెక్రటరీలు కూడా ఎలాంటి చర్యలూ చేపట్టడం లేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే అప్పుడు స్పందిస్తున్నారు. గ్రామం మొత్తం డ్రెయిన్లు బాగుచేయించడం లేదు. వర్షాకాలం రాక ముందే గ్రామాల్లోని డ్రెయిన్లు బాగు చేయించాలి. కనీసం కచ్చా కచ్చా డ్రెయిన్లు తవ్వించాలి. ఏ పంచాయతీలోనూ వీటిపై దృష్టిపెట్టడం లేదు. దాంతో మురుగునీరు రోడ్డుపైకి వచ్చి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని పంచాయతీల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చిన ఈ ఏడాదిలో గ్రామాల్లో బ్లీచింగ్, దోమల నివారణకు చర్యలు లేవు. కొన్ని గ్రామాల్లో చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాల నిర్వహణ సక్రమంగా ఉండకపోవడంతో చెత్తను రోడ్లు, కాలువ గట్లపై డంప్ చేస్తున్నారు. వర్షాకాలంలో తాగునీటి క్లోరినేషన్ మాత్రమే చేయిస్తున్నారు. మండల స్థాయి అధికారులు రోజుకు ఒక గ్రామంలో తిరుగుతూ మంచి నీటి ట్యాంకుల శుభ్రం, క్లోరినేషన్ చేయించి చేతులు కడుక్కుంటున్నారు.

> **చర్యలు తీసుకుంటాం**
>
> గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటాం. డ్రెయినేజీ వ్యవస్థ అభివృద్ధికి చర్యలు చేపడతాం. నీరు నిల్వ ఉండకుండా కచ్చా డ్రెయిన్లు తవ్విస్తాం. బ్లీచింగ్ చల్లించడంతో పాటు ఆరోగ్య శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ దోమల నివారణ మందులు పిచికారీ చేయిస్తాం.
>
> – ఎస్.రామనాథ్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి

ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ విరమించుకోవాలి



రైతుల సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

పెదవేగి: పెదవేగిలో ఏపీ ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ ఆలోచన విరమించుకోవాలని దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కోకో రైతుల ఇబ్బందులను సోమవారం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఎన్ని అమలు చేశారో గమనించాలన్నారు. లాభాల్లో ఉన్న పెదవేగి పామాయిల్ ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ చేయాలన్న కూటమి ప్రభుత్వ ఆలోచన సరైంది కాదని హెచ్చరించారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని, దెందులూరు నియోజకవర్గంలో రైతన్నల పరిస్థితి దారుణంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. 30 ఏళ్ల క్రితం ప్రభుత్వం పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసిందని, ఉమ్మడి రాష్ట్రంలో ఏకైక ఫ్యాక్టరీ పెదవేగి అని అన్నారు. ఈ పంటపై ఆధారపడి 11 వేల మంది రైతులు దెందులూరు నియోజకవర్గంలో ఉన్నారని, ప్రస్తుతం రూ.10 నుంచి రూ.15 కోట్ల లాభాల్లో ఉందన్నారు. పెదవేగి ఫ్యాక్టరీని ప్రైవేటీకరిస్తే దాని మీద ఆధారపడిన రైతుల పరిస్థితి ఏంటని నిలదీశారు. రైతులను అన్ని విధాలుగా నష్టపరుస్తున్నామని దుయ్యబట్టారు. అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఫ్యాక్టరీని రూ.80 కోట్లతో ఆధునికీకరించిందన్నారు.

ధాన్యం డబ్బులు ఎప్పుడిస్తారు?

ప్రతి రైతు ఇంటి దగ్గర కోకో గింజల నిల్వలతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారని, ఇంటర్నేషల్ మార్కెట్ లో కోకో రూ.1000 ధర ఉంటే, ఇక్కడ మాత్రం రూ.450 మాత్రమే ఇవ్వడమేంటని ప్రశ్నించారు. ధాన్యం డబ్బులు ఇంకా ఇవ్వలేదని వెంటనే రిలీజ్ చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వంలో ఏ పంటకు మద్దతు ధర దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు, దెందులూరు నియోజకవర్గ నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సప్త ప్రదక్షిణల్లో పాల్గొన్న భక్తులు



క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో సప్త ప్రదక్షిణల్లో పాల్గొన్న భక్తులు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయంలో నాల్గవ సోమవారం సప్త ప్రదక్షిణలు నిర్వహించారు. చేతిలో ఏడు మారేడు దళాల పత్రాలను పట్టుకుని స్వామివారి మాడ వీధుల్లో వేలాది సంఖ్యలో భక్తులు ప్రదక్షిణలు చేశారు. అనంతరం స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. రాత్రి 7 గంటలకు స్వామివారికి పంచహారతుల కార్యక్రమం జరిపారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాస్, సూపరింటెండెంట్ వాసు, అర్చకులు కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

కాత్రేనిపాడు విద్యార్థికి శ్రేష్ఠ ప్రవేశ పరీక్షలో 4వ ర్యాంకు

ముసునూరు: కేంద్ర ప్రభుత్వం నిర్వహించే శ్రేష్ఠ ప్రవేశ పరీక్షలో ముసునూరు మండలం కాత్రేనిపాడుకు చెందిన దేవరపల్లి మోక్షజ్ఞ అక్షిత్ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో నాలుగో ర్యాంకును సాధించినట్లు తండ్రి సురేష్ తెలిపారు. తమ కుమారుడు విజయనగరం జిల్లాలోని కోరుకొండ సైనిక్ స్కూల్లో 8వ తరగతి చదువుతూ ఎస్సీ విద్యార్థుల కోసం కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న నేషనల్ లెవెల్ శ్రేష్ఠ ప్రవేశ పరీక్ష రాశాడన్నారు. నాలుగవ ర్యాంకుతో సీబీఎస్ఈ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 9వ తరగతిలో ప్రవేశానికి అర్హత సాధించినట్లు చెప్పారు. విద్యార్థి మోక్షజ్ఞ అక్షిత్‌కు పలువురు అభినందనలు తెలియజేశారు.

మునిసిపల్ కార్మికుల పోరు ఉద్ధృతం

- నిరాహార దీక్షలు, అర్ధ నగ్న ప్రదర్శనలు
- అధికారులకు సమ్మె నోటీసులు
- ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్
- ప్రభుత్వం దిగిరాకపోతే ఆందోళనలు మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరిక

ఉద్యోగ భద్రత కోసం మునిసిపల్ ఇంజనీరింగ్, అవుట్ సోర్సింగ్ కార్మికులు చేపట్టిన పోరు ఉద్ధృతంగా కొనసాగుతోంది. ఇప్పటివరకు వాటర్ వర్క్స్, లైటింగ్ విభాగాల్లో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఒక్కరి చొప్పున సహకరించామని, ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారంలో శ్రద్ధ చూపకపోవడంతో ఇకపై పూర్తిస్థాయి ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. అధికారులకు సమ్మె నోటీసులు ఇచ్చారు. తమను పర్మినెంట్ చేసి టీడీపీ ఇచ్చిన ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



నరసాపురం వశిష్ట గోదావరి వలంధర్ రేవులో మున్సిపల్ కాంట్రాక్ట్ ఉద్యోగులు, కార్మికుల జలదీక్ష



ఏలూరులో ఆందోళన నిర్వహిస్తున్న ది జోనల్ మున్సిపల్ ఎంపాయీస్ యూనియన్ ఉద్యోగులు, నాయకులు



తణుకులో మునిసిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం



జంగారెడ్డిగూడెంలో కార్మికుల సమ్మెకు మద్దతు పలికిన వైఎస్సార్‌సీపీ నేతలు

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలోని నగరపాలక సంస్థల్లో, పురపాలక సంఘాల్లో, నగర పంచాయతీల్లో పనిచేస్తున్న ఇంజనీరింగ్ విభాగంలోని అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని మునిసిపల్ ఇంజినీరింగ్ అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్‌ఆర్ పేట ఎస్ ఆర్ టు వద్ద ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన గేటు మీటింగ్‌లో వారు మాట్లాడారు. ఏళ్ల తరబడి అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్నా ప్రభుత్వం తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగ సిబ్బందిని పర్మినెంట్ చేస్తామని టీడీపీ ఇచ్చిన ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ డాంగే, జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఏలూరు ఏరియా కార్యదర్శి ఏ అప్పలరాజు, ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు బి నాగేశ్వరరావు, కోశాధికారి బి నారాయణరావు, యూనియన్ నాయకులు నారా శ్రీను, కందుల శ్రీనివాస్, అప్పారావు తదితరులు నాయకత్వం వహించారు.

నరసాపురంలో అర్ధనగ్నంగా జలదీక్ష

నరసాపురం: స్థానిక వశిష్టగోదావరి వలంధర్‌రేవు గోదావరిమాత విగ్రహం వద్ద కార్మికులు సోమవారం వినూత్నరీతిలో ఆందోళన చేశారు. అర్ధనగ్నంగా గోదావరిలో దిగి జలదీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జేఏసీ కమిటీ నాయకులు ఆర్ రత్నం, వి.ఫణి, ఎం.సత్యనారాయణ, కె.కాశీ, సీహెచ్ వాసు, ఎ.మధుబాబు, ఎం.సుజాత, టి.కళ్యాణి, ఎస్ దేవి, కె.అనంతలక్ష్మి నాయకత్వం వహించారు.

ఇకపై పూర్తిస్థాయి సమ్మె

తణుకు అర్బన్: ఇకపై పూర్తి స్థాయి సమ్మెకు దిగుతున్నట్లు మునిసిపల్ ఇంజనీరింగ్ అవుట్ సోర్సింగ్ జేఏసీ అధ్యక్ష, కార్యదర్శులు ఉండ్రాజవరపు శ్రీను, గెల్లా విజయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం మునిసిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం సమ్మెలో భాగంగా మునిసిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన శిబిరంలో కార్మికులు తమ నిరాహార దీక్షలను కొనసాగించారు. ఈ కార్యక్రమంలో దాసరి సత్యనారాయణ, పిండి పెద్దిరాజు, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మద్దతు

జంగారెడ్డిగూడెం: న్యాయమైన కోర్కెల కోసం మునిసిపల్ ఇంజనీరింగ్ వర్కర్లు చేపట్టిన ఆందోళనలకు వైఎస్సార్ సీపీ నాయకులు మద్దతు తెలిపారు. ఆందోళనల్లో భాగంగా యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కమిషనర్‌కు సమ్మె నోటీస్ ఇచ్చినట్లు యూనియన్ అధ్యక్షుడు కంతేటి వెంకట్రావు తెలిపారు. ఇకపై పట్టణంలో వీధిదీపాలు నిలుపుదల చేస్తామని, దశలవారీగా మంచినీటి సప్లయ్ కూడా నిలుపుదల చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమ్మెకు మద్దతుగా మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ కంచర్ల వాసవి నాగరత్నం, ముప్పిడి వీరాంజనేయులు, వైఎస్సార్‌సీపీ టౌన్ ప్రెసిడెంట్ చిటికెల అచ్యుతరామయ్య, కౌన్సిలర్లు మద్దతు తెలిపారు.

పోటీ కార్మికులను దింపడంపై అభ్యంతరం



పాతూరు హెడ్ వాటర్ వర్క్స్ వద్ద నిరసన

తాడేపల్లిగూడెం (టీఓసీ): మునిసిపాలిటీ ఆధ్వర్యంలో పాతూరు శివారు హెడ్ వాటర్ వర్క్స్, ఫిల్టర్ ప్లాంట్‌లు వద్ద పోటీ కార్మికులను దింపారన్న విషయాన్ని తెలుసుకున్న ఇంజనీరింగ్ సెక్షన్ కార్మికులు సాయంత్రం నిరసన శిబిరం వద్ద నుంచి బైక్ ర్యాలీగా స్థానిక హెడ్ వాటర్స్ వర్క్స్ గేటు వద్దకు చేరుకున్నారు. పోటీ కార్మికులను తీసుకురావడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. నిరసన కార్యక్రమం వద్దకు పోలీసులు చేరుకుని వాటర్ సప్లైను అడ్డుకోవడం సరికాదని, ప్రజలు ఇబ్బందులను గుర్తించాలని, లేని పక్షంలో అరెస్ట్ చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు సమ్మె నుంచి వెనక్కి తగ్గబోమని, ఆందోళనను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. తొలుత స్థానిక పురపాలక సంఘం కార్యాలయం వద్ద మునిసిపల్ ఇంజనీరింగ్ అవుట్ సోర్సింగ్ కార్మికులు సోమవారం 8వ రోజు చేపట్టిన నిరసన దీక్షలకు సీఐటీయూ నేతలు సంఘీభావం తెలిపారు.

ట్రిపుల్ ఐటీ కౌన్సెలింగ్ తొలిరోజు ప్రశాంతం

446 మందికి ప్రవేశాలు



నూజివీడు ట్రిపుల్ ఐటీలో కౌన్సెలింగ్‌కు హాజరైన అభ్యర్థులు

నూజివీడు : ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీలో పీయూసీ ప్రథమ సంవత్సరానికి నిర్వహించిన ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రక్రియ సోమవారం ప్రశాంతంగా జరిగింది. నూజివీడు ట్రిపుల్ ఐటీకి 1,010 మందిని ఎంపిక చేయగా వారిలో తొలిరోజు 505 మందిని కౌన్సెలింగ్‌కు ఆహ్వానించారు. ఉదయం 8 గంటల కల్లా కౌన్సెలింగ్ ప్రారంభించారు. ఈ కౌన్సెలింగ్‌లో ఎంపికైన విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలించి ప్రవేశాలు కల్పించారు. దీనికి సంబంధించిన ఫీజులను కూడా కట్టించుకున్నారు. తొలిరోజు 446 మంది అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు హాజరవ్వగా వారందరికీ అడ్మిషన్లు కల్పించారు. ట్రిపుల్ ఐటీ అడ్మిషన్ల కన్వీనర్, ఇన్‌చార్జి డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్, సీఏఓ బండి ప్రసాద్, సెంట్రల్ డీన్ దువ్వూరు శ్రావణి, అకడమిక్స్ డీన్ సాదు చిరంజీవి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ మేరుగ అర్జునరావుల పర్యవేక్షణలో ఎలాంటి అవాంతరాలూ లేకుండా కౌన్సెలింగ్ జరిగింది. పలువురు మెంటార్లు, లెక్చరర్లు నిరంతరం కౌన్సెలింగ్ హాలులో ఉండి సర్టిఫికెట్‌ల పరిశీలనలో సిబ్బందికి కలిగే సందేహాలను నివృత్తి చేశారు. కౌన్సెలింగ్‌లో భాగంగా సర్టిఫికెట్ల పరిశీలన కోసం 20 కౌంటర్లను ఏర్పాటు చేసి 100 మంది సిబ్బందిని నియమించి కౌన్సెలింగ్ ప్రక్రియను తొలిరోజు ప్రశాంతంగా ముగించారు. ఎస్సీ, బీసీ, ఎస్టీ సంక్షేమ అధికారులను ఏర్పాటు చేసి విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎవరికీ ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. తాగునీరు, ప్రథమ చికిత్స కౌంటర్లు, ఎన్‌సీసీ క్యాడెట్ల సేవలు అందుబాటులో ఉండటంతో అంతా సజావుగా సాగింది. వచ్చిన అభ్యర్థులకు, వారి తల్లిదండ్రులకు తక్కువ ధరకే భోజన సదుపాయాన్ని కల్పించారు.

కవలలకు సీట్లు



ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన కవలలు కుందన, కుందన్

ఎన్టీఆర్ జిల్లా కంచికచర్లకు చెందిన ఇద్దరు కవలలకు నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీట్లు లభించాయి. సోమవారం కౌన్సెలింగ్ కోసం నూజివీడు ట్రిపుల్ ఐటీకి వచ్చిన నందికట్ల కుందన్ వెంకట నాగశ్రీ సాయి, నందికట్ల కుందన వెంకట నాగశ్రీ కంచికచర్లలోని జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుకున్నారు. కుందన్‌కు 587 మార్కులు, కుందనకు 584 మార్కులు వచ్చాయి. వారిద్దరూ ట్రిపుల్ ఐటీలో సీట్ల కోసం దరఖాస్తు చేయగా, ఇద్దరికీ నూజివీడు ట్రిపుల్ ఐటీలోనే సీట్లు వచ్చాయి. దీంతో సోమవారం వారిద్దరూ పీయూసీలో చేరారు. ఈ సందర్భంగా వారిని డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ అభినందించారు.

లారీ ఢీకొని మోటార్‌సైక్లిస్టు మృతి



ఘటనా స్థలంలో వెంకటేశ్వరరావు మృతదేహం

పాలకోడేరు: లారీ ఢీకొని మోటార్‌సైకిల్‌పై వెళుతున్న వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన గొల్లలకోడేరులో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. పాలకోడేరు తూర్పు పేటకు చెందిన ఆవాల వెంకటేశ్వరరావు (40) మోటార్‌సైకిల్‌పై గొల్లలకోడేరు వెళ్లి తిరిగి వస్తుండగా గొల్లలకోడేరు బ్రిడ్జి దాటిన వెంటనే ఎదురుగా టిప్పర్ లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటేశ్వరరావు తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108కి సమాచారం అందించగా భీమవరం నుంచి వచ్చిన 108 అత్యవసర వాహన సిబ్బంది పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. వెంకటేశ్వరరావు భార్య దేవి ఆశా కార్యకర్తగా పనిచేస్తున్నట్లు స్థానికులు తెలిపారు. వెంకటేశ్వరరావుకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ఏలూరు టౌన్: ఒంటికి నిప్పంటించుకొని ఆత్మహత్యయత్నానికి పాల్పడిన మహిళ విజయవాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. వివరాల ప్రకారం ఏలూరు బీడీకాలనీకి చెందిన లావేటి సోమేశ్వరరావు, మోహనమ్మకు 2024 ఆగస్టులో వివాహమైంది. కొంతకాలం కాపురం సజావుగా సాగినా అనంతరం ఇద్దరి మధ్య విభేదాలతో గొడవలు ప్రారంభం అయ్యాయి. ఈ నేపథ్యంలో ఆమె ఏలూరు మహిళా పోలీస్‌స్టేషన్‌లో భర్తపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. కానీ భర్తను జైలులో పెట్టలేదంటూ ఈనెల 26న మోహనమ్మ జిల్లా జైలు సమీపంలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పు అంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తీవ్ర గాయాలైన ఆమెను ఏలూరు జీజీహెచ్‌కు తరలించగా వైద్యులు చికిత్స అందించి, అనంతరం మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం విజయవాడ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మోహనమ్మ మృతిచెందింది.

మొక్కజొన్న సాగులో మెలకువలు ఇలా..



మెట్ట ప్రాంతంలో రైతులు సాగు చేస్తున్న ఖరీఫ్ మొక్కజొన్న

పాడి-పంట

చింతలపూడి : మొక్కజొన్న పంటను వర్షాధారంగాను, సాగునీటి కింద పండిస్తారు. మొక్కజొన్న ఆహార పంటగానే కాకుండ దాణా రూపంలో పశువులకు మేతగాను, వివిధ పరిశ్రమల్లో ముడి సరుకుగాను, పేలాల పంటగాను, కాయగూర రకంగాను రైతులు సాగు చేస్తున్నారు. ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలో 48 వేల హెక్టారుల్లో రైతులు మొక్కజొన్న సాగు చేస్తున్నారు. ఏటా 4.40 లక్షల టన్నుల దిగుబడి సాధిస్తున్నారు. ఖరీఫ్ మొక్కజొన్న సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సాగు వివరాలను వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వై సుబ్బారావు రైతులకు సూచించారు.

విత్తే సమయం

సాధారణంగా జూన్ 15 నుంచి జూలై లోగా విత్తుకోవాలి. అయితే వర్షాలు ఆలస్యంగా కురిస్తే నీటి వసతి కింద స్వల్పకాలిక హైబ్రీడ్ రకాలు ఆగస్టు రెండో వారంలో కూడా విత్తుకోవచ్చు.

అనువైన రకాలు

- **దీర్ఘకాలిక రకాలు:** (100-120) రోజులు డీహెచ్ఎం -113, 900 ఎం గోల్డ్, బయో 9861, ప్రో-311, 30బి07
- **మధ్య కాలిక రకాలు :** (90-100 రోజులు) డీహెచ్ఎం-111, 117, 119, కేహెచ్-510, బయో- 9657, కేఎం-9541, ఎంసీహెచ్-2
- **స్వల్పకాలిక రకాలు :** (వీటి కాల పరిమితి 90 రోజుల కంటే తక్కువ) డీహెచ్ఎం- 115, ప్రకాశ్ కేహెచ్-5991, జేకేఎంఎచ్-1701 డీకేసీ-7074 ఆర్, ఎంఎంహెచ్-1701, డీకేసీ- 7074 ఆర్, ఎంఎంహెచ్- 133, 3342.

ప్రత్యేక రకాలు

- **తీపి మొక్కజొన్న (స్వీట్ కార్న్):** మాధురి, ప్రియ, విన్ ఆరెంజ్, అల్మోరా స్వీట్ కార్న్ రకాలు, సుగర్-75, బ్రైట్‌జీన్ సంకర రకాలు.

విత్తే విధానం

ఎకరాకు సంకర రకాలైతే 7-8 కిలోల విత్తనం వాడి 60 సెం.మీ ఎడంగా బోదెలు చేసి సాళ్లలో 20 సెం.మీ ఎడంగా విత్తాలి. ఇలా విత్తితే ఎకరాకు సుమారు 33,333 మొక్కలు వస్తాయి. విత్తే ముందు కిలో విత్తనానికి 3 గ్రాముల కాప్టాన్ లేదా డైథేన్ ఎం.45 చొప్పున కలిపి విత్తన శుద్ధి చేసి బోదెకు ఒక పక్కగా విత్తాలి.

ఎరువుల వాడకం

ఖరీఫ్ పంటలో ఎకరాకు 72-80 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం, 20 కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులు వాడాలి. మొత్తం పొటాష్, భాస్వరం ఎరువులను పంట విత్తే సమయంలోనే వేసుకోవాలి. ఒకవేళ జింక్ లోపం ఉంటే ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్ వేయాలి. పైరుపై జింక్ లోపం గమనిస్తే జింక్ సల్ఫేట్ (20 గ్రా) పిచికారీ చేయాలి.

కలుపు నివారణ

పంట విత్తాక 45 రోజుల వరకు కలుపు లేకుండా చూసుకోవాలి. మొక్కజొన్న పంటను ఏక పంటగా వేసినప్పుడు నేల రకాన్ని బట్టి ఎకరాకు 800-1200 గ్రా, అట్రాజిన్ పొడి మందును 200 లీటర్ల నీటిలో కలిపి పంట విత్తిన వెంటనే లేదా 2-3 రోజుల్లోగా పిచికారీ చేసి కలుపును నివారించవచ్చును. వెడల్పాటి కలుపు మొక్కల నివారణకు విత్తిన 30 రోజుల తర్వాత ఎకరాకు అరకిలో 2, 4-డి సోడియం సాల్ట్‌తో పిచికారీ చేయాలి.

నీటి తడులు

వర్షాధారంగా సాగు చేసినా పూత దశలో వర్షాభావ పరిస్థితులేర్పడితే వీలున్న చోట నీరు తడిపితే మంచి దిగుబడులు వస్తాయి. పూత దశ, గింజలు ఏర్పడే దశల్లో నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి. పైరు తొలి దశలో పొలంలో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.



వై సుబ్బారావు
వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్

సస్యరక్షణ

పైరు తొలి దశలో ఆశించే మొవ్వ తొల్చే పురుగు నివారణకు ముందు జాగ్రత్తగా విత్తిన 10-12 రోజులకు పైరుపై మోనోక్రోటోఫాస్ (1.6 మి.లీ) లేదా కోరా.ఎన్ (03 మి.లీ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. లేదా కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను ఎకరాకు 3 కిలోల చొప్పున పైరు 25-30 రోజుల దశలో ఆకు సుడుల్లో వేయాలి.

ఆకు మాడు తెగులు నివారణకు మాంకోజెట్ (2.5 గ్రా) లీటర్ నీటిలో కలిపి వారం, పది రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. పొడ తెగులు లక్షణాలు కనిపిస్తే మొక్క దిగువనున్న 2-3 ఆకులు తుంచివేసి ప్రాపికొనజోల్ (1 మి.లీ) లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. మొక్క ఎండు, కాండం మసికుళ్లు తెగుళ్ల రాకుండా ముందు జాగ్రత్తగా ఎదుర్కొనే రకాల సాగు, పంట మార్పిడి, వేసవిలో లోతు దుక్కులు, పూత దశ తర్వాత నీటి ఎద్దడి పరిస్థితులు తలెత్తకుండా జాగ్రత్తలు చూసుకోవాలి.

ఆటో అదృశ్యంపై కేసు నమోదు

భీమవరం: ఆటో అదృశ్యంపై భీమవరం వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం భీమవరం పట్టణం చినఅప్పారావు తోటకు చెందిన చెన్ను సత్యనారాయణ ఆటోను ఫైనాన్స్‌లో తీసుకుని సుంకర పద్దయ్య వీధికి చెందిన బోడపాటి నానిబాబుకు అద్దెకు ఇచ్చేవాడు. ప్రతి రోజు నానిబాబు రాత్రిపూట సత్యనారాయణ ఇంటి వద్దనే ఆటోను పార్కింగ్ చేస్తుండగా గతేడాది నవంబర్ 15వ తేదీన ఆటో కనిపించలేదు. దానిపై సత్యనారాయణ నానిబాబును ప్రశ్నించగా తనకు తెలియదని చెప్పాడు. దీంతో సత్యనారాయణ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

త్వరితగతిన కేసుల పరిష్కారానికి కృషి



సమావేశంలో పాల్గొన్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): ఫ్రీ లీగల్ ఎయిడ్ ద్వారా అందించే కేసుల త్వరితగతిన పరిష్కారానికి ప్యానల్ న్యాయవాదులు కృషి చేయాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ సూచించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల మేరకు ఆయన సోమవారం స్థానిక జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో ప్యానల్ న్యాయవాదులతో వర్క్ రివ్యూ నిర్వహించారు. కక్షిదారులకు ఉచితంగా వాదించే కేసులు పై ఆరా తీశారు. జూలై 5న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి న్యాయవాదులు కక్షిదారులకు కౌన్సెలింగ్ నిర్వహించి, కేసుల పరిష్కారాన్ని కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పీఎస్‌వీ మునేశ్వర ప్యానెల్ న్యాయవాదులు పాల్గొన్నారు.

నేషనల్ 'డాక్టర్స్ డే' Happy Doctors Day శుభాకాంక్షలు... Special Feature

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లిగూడెం: మునిసిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సమస్యలపై పది వినతిపత్రాలు వచ్చాయి. టిడ్కో గృహాలకు సంబంధించి ఒకటి, ఇంజనీరింగ్ విభాగంలో రెండు, ప్రజారోగ్యంపై ఐదు వినతులు, పింఛన్లపై రెండు, మొత్తం పది ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఎం.ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలం వ్యాధుల నివారణ మన చేతుల్లోనే

తణుకు అర్బన్: వర్షాకాలం వ్యాధుల నివారణ మన చేతుల్లోనే ఉందని, అప్రమత్తంగా వ్యవహరిస్తే వ్యాధులకు లోనవ్వాల్సి వస్తుందని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని 14, 29 వార్డుల్లో సోమవారం మలేరియా మాసోత్సవం జూన్ 2025అవగాహన కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో వ్యాధుల నివారణకు ప్రతి రోజూ డ్రైడే గా పాటించాలని, వారం రోజుల పైబడి స్తబ్దతతో ఉన్న నీటి నిల్వలు ఉంటే వెంటనే తొలగించుకోవాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఖర్చు రహిత పద్ధతిలో ఇంటి ఆవరణలో దోమ పుట్టుకకు చెక్ పెట్టాలని, దోమకాటు రక్షణ కొరకు దోమ తెరలను వాడాలని, స్లీవ్ దుస్తులు ధరించాలని, దోమ వికర్షకాలైన బంతి, పుదీనా, తులసి మొక్కలను పెంచుకోవాలని, చలి జ్వరం ఉంటే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి గానీ, అర్బన్ హెల్త్ సెంటర్స్‌కు గానీ వెళ్లి వైద్యులను సంప్రదించాలని సూచించారు. అతిసారం, టైఫాయిడ్, జాండిస్ మొదలగు వ్యాధుల బారిన పడకుండా చేతుల శుభ్రత, ఆహార పదార్థాలను ఉంచిన పాత్రలపై విధిగా మూతలు ఉంచడం, కాచి చల్లార్చిన నీటిని తాగడం చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఫైలేరియా కంట్రోల్ యూనిట్ సూపర్‌వైజర్ కె.సత్యనారాయణ, వార్డు హెల్త్ సెక్రటరీలు జె.శాంత కుమారి, బి.వెంకటరమణ,హెల్త్ అసిస్టెంట్ అసిస్టెంట్, ఆశా కార్యకర్త పాల్గొన్నారు.



తణుకులో మురుగుతో నిండిన డ్రెయినేజీని పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

జాతీయ రెటీనా సమ్మిట్‌కు డాక్టర్ సందీప్

తాడేపల్లిగూడెం: విశాఖలో రెండు రోజుల పాటు జరిగిన మూడవ జాతీయ రెటీనా సమావేశానికి పట్టణానికి చెందిన ప్రముఖ నేత్రవైద్యనిపుణులు డాక్టర్ సందీప్ హాజరయ్యారు. రెటీనల్ డిటాచ్‌మెంటు సర్జరీపై డాక్టర్ సందీప్ మాట్లాడారు.

ఎస్‌కేఎస్‌డీలో జాతీయ సాంఖ్యక శాస్త్ర దినోత్సవం

తణుకు అర్బన్: స్థానిక ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో సోమవారం జాతీయ సాంఖ్యక శాస్త్ర (స్టాటస్టిక్స్) దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ యు.లక్ష్మీ సుందరీబాయ్ మాట్లాడుతూ మానవ జీవితంలో స్టాటస్టిక్స్ ప్రాముఖ్యత ఎంతో కీలకమని అన్నారు. సమాజంలో ఆర్థిక సాంఘిక, సామాజిక, సాంకేతిక రంగాలకు దేశాభివృద్ధికి సంబంధించిన అంశాలను అంచనా వేయడంలో ప్రముఖ పాత్ర పోషిస్తుందని స్పష్టం చేశారు. అనంతరం స్టాటిస్టిక్స్ అధ్యాపకులు సీహెచ్ నాగరాజు ఈ శాస్త్ర ప్రాముఖ్యతను, దేశాభివృద్ధిలో దీని పాత్ర, ఉపాధి అవకాశాలపై వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, జెస్టఫర్ మినిట్, పోస్టర్ ప్రజెంటేషన్ విజేతలకు ప్రిన్సిపల్ సుందరీబాయ్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎ.దీప్తి, విద్యార్థినులు పాల్గొన్నారు.

చిన్నారులు బడిలోనే ఉండాలి

తాడేపల్లిగూడెం రూరల్: బడిఈడు కలిగిన చిన్నారులు బడిలోనే ఉండాలని ఎంఈవో వి.హనుమ అన్నారు. సోమవారం మండలంలోని నీలాద్రిపురం మోడల్ స్కూల్ విద్యార్థులకు ఉప్పలపాటి శ్రీధర్, అబ్బిన వీరవెంకట్రావు సహకారంతో నోటు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో హనుమ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థులకు దాతలు తమ వంతు తోడ్పాటు అందించాలన్నారు. తద్వారా చిన్నారుల విద్యాభ్యాసానికి ఊతమిచ్చిన వారవుతారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని విధిగా పాఠశాలలకు పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో–2 పీఎంకే.జ్యోతి, ఉపాధ్యాయులు వై.కనకదుర్గ, కే.కరుణ, పుల్లంరాజు, శైలజ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కూరగాయల మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) సర్వసభ్య సమావేశం సోమవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో జవ్వాది శ్రీను అధ్యక్షతన జరిగింది. కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ జూలై 9వ తేదీన జరగబోవు దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెకు 11 జాతీయ కార్మిక సంఘాలు, రాష్ట్ర ఉద్యోగులు, రైతులు, వ్యవసాయ కార్మికులు సంయుక్తంగా నిర్వహిస్తున్నారని, దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో యాసరపు ఎర్ర నాయుడు, బత్తినాగ సత్యనారాయణ, వై.పైడన్న, ఎమ్.గణపతి, లచ్చిపతుల శ్రీను, నాగిరెడ్డి సాయి, బొబ్బిలి తాతారావు, నొడు రాజు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలి

అత్తిలి: ఆరవల్లి గ్రామంలో అన్నదమ్ములు భావంతో ఉండవలసిన మాల మాదిగలు, కొంతమంది మాదిగలు మాలలపై మారణ ఆయుధాలతో దాడి చేయటం దారుణం అని మాల మహానాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్ప రాజ్ తీవ్రంగా ఖండించారు. ఆరవల్లి గ్రామంలో దాడికి గురైన బాధిత కుటుంబాలను సోమవారం ఆయన పరామర్శించి అనంతరం దళితవాడలో ఏర్పాటు చేసిన నాలుగో రోజు సంఘీభావ దీక్షకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పుష్పరాజ్ మాట్లాడుతూ దాడి చేసిన ఘటనలో ప్రధాన నిందితుడికి బెయిల్ రద్దు చేసి రిమాండ్‌కి పంపించి బాధిత కుటుంబాలకు ప్రభుత్వం న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ సాహిత్య వేదిక అధ్యక్షుడు కవి కోలాటి పెద్దిరాజు, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు ఇంటి సుందర్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోలాటి ప్రసాదరావు, ఉండి నియోజకవర్గ సోషల్ మీడియా అధ్యక్షుడు జొన్నల వజ్రం, భీమవరం యువజన విభాగం అధ్యక్షుడు పిట్టా వినోద్ కుమార్, భీమవరం పట్టణ విద్యార్థి విభాగం అధ్యక్షుడు ఈది ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు

గర్భధారణ సమయంలో దంత సంరక్షణ ముఖ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): గర్భం దాల్చిన స్త్రీలలో చాలా మార్పులు చోటు చేసుకుంటాయని, వాటిలో దంతాల సమస్యలు కూడా ఉంటాయని శ్రీశ్రీ డెంటల్ నిర్వాహకులు డాక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. నలభై శాతం గర్భిణీ స్త్రీలలో దంత సమస్యలు సాధారణంగా ఉంటాయని, ఆ సమయంలో వారు దంత వైద్యులను సంప్రదించకపోవడం వల్ల చాలా రకాల సమస్యలు వచ్చే అవకాశం ఉందని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. గర్భధారణ సమయంలో నోటిలో వచ్చే మార్పు లు, వాటికి గల కారణాలను ఈ సందర్భంగా వివరించారు.

ఎంపీడీవో బాలాజీ సేవలు అభినందనీయం

పెంటపాడు: మండలంలోని డివిజనల్ పంచాయతీ ఇన్‌చార్జి అధికారిగా, పెంటపాడు ఎంపీడీవోగా బాలాజీ వెంకటరమణ సేవలు అభినందనీయమని ఎంపీపీ దాసరి హైమావతి పేర్కొన్నారు. సోమవారం రాత్రి పెంటపాడు మండల పరిషత్ ప్రాంగణంలో ఎంపీడీవోగా పనిచేసి పదవీ విరమణ చేసిన బాలాజీ అభినందన సత్కార సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. పెంటపాడు మండల కార్యదర్శుల సంఘం, మండల పరిషత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.